క్లుప్తంగా

విఘ్నేశ్వరుడి ఆలయంలో పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాంనగర్‌కాలనీలో శనివారం రాత్రి విఘ్నేశ్వరుని కొలువుదీర్చారు. స్థానిక యువకులు కొలువుదీర్చిన ఈ గణనాథుడి తొలిపూజకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కర్పూర హారతులు పట్టి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక యువకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సంతపేట, డీఐరోడ్డు, హైరోడ్డు, బజారువీధి, చవటపల్లె ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. మార్పును వినియోగదారులు గమనించాల్సిందిగా కోరారు.

17న బైక్‌ల వేలం

బంగారుపాళెం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 17న ద్విచక్రవాహనాలు వేలం వేయనున్నట్లు సీఐ కత్తి శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులకు సంబంధించి 13 బైకులు పట్టుకోవడం జరిగిందన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నిబంధనలు అనుసరించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు అవమానం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం వచ్చిన మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు ఆలయ అధికారులు ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యం వహించారు. ఆయన వచ్చే సమయానికి ఎక్కడికక్కడ గేట్లు వేసేశారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మండిపడ్డారు. దళిత సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేని కావడంతోనే ఈ దుస్థితి అని పలువురు ఆలయ అధికారులపై మండిపడుతున్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు శనివారం ఓ దాత నగదు విరాళం చేశారు. ఐరాల మండలం అగరంపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి రూ.లక్ష నగదు ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, సిబ్బంది వాసు, బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధుల నివారణకు టీకాలు



వీఎస్ అగ్రహారంలో చిన్నారికి టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

ఐరాల: గర్భిణులు, చిన్నారులకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా వందశాతం టీకాకరణ లక్ష్యాన్ని సాధించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని సచివాలయాల్లో గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ స్దర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణిగా నమోదు చేసుకున్న వెంటనే ధనురాత్వ టీకాతో పాటు పుట్టిన చిన్నారి నుంచి 16 ఏళ్ల వరకు ప్రాణాంతక వ్యాధుల నివారణకు క్రమం తప్పకుండా వ్యాధి నివారణ టీకాలు వేయాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు టీకాకరణ కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. చిన్నారులకు టీకాలు వేయడం ద్వారా క్షయ, కోరింత దగ్గు, తట్టు, పోలియో తదితర వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తోందని తెలిపారు. వ్యాక్సిన్‌లను భద్రపరచడం, కోల్డ్‌చైన్ నిర్వహణ, జాతీయ ఇమ్యునైజేషన్ షెడ్యూల్, టీకాకరణ తదితర అంశాలను వివరించారు. అనుమానిత పోలియో, తట్టు, రూబెల్లా, కోరింత దగ్గు, కంఠసర్పి, ధనురాత్వం తదితర వ్యాధులపై ప్రత్యేక నిఘా ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. చిన్నారుల్లో అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గొంతెండుతోంది మాస్టారు

గత ప్రభుత్వం సర్కారు స్కూళ్లను బలోపేతం చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేస్తోంది. గతంలో నాడు–నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు పౌష్టికాహారం లోపం తలెత్తకుండా పోషకాహారం అందించింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ స్కూళ్లలో వసతులు కరువయ్యాయి. పర్యవేక్షణ కొరవడింది. విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైంది. విద్యార్థినుల కాలకృత్యాలకు నీరు లేక ఇక్కట్లు పడుతున్నారు.

విద్యార్థులకు జగ్గుతో నీరు పోస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బంది



కొటాలం హైస్కూల్‌లో తాగునీటికి కటకట

- మరుగుదొడ్లలో రాని నీరు
- దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్న విద్యార్థినులు
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఉపాధ్యాయులు
- అయినా స్పందన కరువు
- ఇప్పటికైనా స్కూల్‌లో నీటి కొరత తీర్చాలంటున్న విద్యార్థులు



కొటాలం హైస్కూల్

యాదమరి : కూటమి సర్కారు ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణను గాలికొదిలేసింది. కనీస సదుపాయాలు కల్పించడంలో కూడా విఫలమవుతోంది. గతంలో ఏ ప్రభుత్వ స్కూల్లో చూసినా కూడా మౌలిక సదుపాయాలకు లోటు ఉండేది కాదు. కానీ ఇప్పుడు కార్పొరేట్‌లకు అనుకూలంగా మారిన ఈ ప్రభుత్వం స్కూళ్లలో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తోందని గ్రామీణ ప్రాంతాల్లోని పలు మండల పరిధిలోని కొటాలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 100 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మండలంలో విద్యార్థులను క్రమశిక్షణతో, వారిలోని ప్రతిభను వెలికితీసి అత్యున్నత ఫలితాలు సాధిస్తున్న పాఠశాలలో ఇది కూడా ఒకటి. అయితే క్రమశిక్షణకు మారుపేరైన ఈ సరస్వతి నిలయంలో విద్యార్థులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో భాగంగా విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి గ్రామంలోని నీటి ట్యాంకు నుంచి పాఠశాల వరకు 250 మీటర్ల మేర రూ.2.40 లక్షలతో స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో పైపులైను వేశారు. అయితే గ్రామంలోని వాటర్ ట్యాంకు నిండిన తరువాతే స్కూల్‌కు విడుదల చేస్తున్నారని అక్కడి మధ్యాహ్న భోజన సిబ్బంది చెబుతున్నారు. నీటి కొళాయిలు లేకపోవడంతో నీటిని బిందెలు, ఇతర పాత్రల్లో నింపి పిల్లలకు జగ్గులతో పోస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆ నీటిని తాగడానికి ఇబ్బందులు పడుతున్నారు.

మరుగుదొడ్లలో దుర్భర దుస్థితి

స్కూల్లోని మరుగుదొడ్లలో అవసరమైన మేర నీరు లేకపోవడంతో ఇక్కడ చదువుతున్న బాలికలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. వేసవి సమయంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. కొద్దిరోజుల పాటు పాఠశాలకు దగ్గరలోని ఓ వ్యవసాయ పొలంలోని ఓ రైతు తమ బోరు నుంచి నీటిని వదిలారు. అయితే ఇప్పుడు వారి పొలానికే చాలకపోవడంతో ఆపేశారు. ఇక్కడ శాశ్వత తాగునీటి ట్యాంకు లేకపోవడం కూడా ఒక కారణంగా తెలుస్తోంది. ఆరు మాసాల ముందు ఇక్కడ బోరు వేస్తే నీరు పడలేదు. దీంతో విద్యార్థుల దాహార్తిని ఎలా తీర్చాలో అర్థం కాక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని.. అయినా ఇంతవరకు ఎలాంటి పరిష్కార చర్యలు తీసుకోలేదని ఓ ఉపాధ్యాయుడు చెప్పారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు చొరవ తీసుకుని విద్యార్థుల నీటి కొరతను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పాత్రలలో నిలువ ఉంచిన నీరు

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

పెద్దపంజాణి: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా పుంగనూరు కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో పెద్దపంజాణి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు కేసులు పరిష్కారమైనట్లు ఎస్‌ఐ ధనంజయ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 9 గొడవలు, 2 కర్ణాటక మద్యం రవాణా, 10 మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మద్యం సేవించిన కేసులో రూ.1.1 లక్షలు, కర్ణాటక మద్యం అక్రమ రవాణాలో రూ.43,840 కక్షిదారులు అపరాధ రుసుం చెల్లించి రాజీ చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వి.కోట: పట్టణంలోని ఎస్‌కే ఎమర్జెన్సీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెంగళూరు మణిపాల్ హాస్పిటల్ వైద్యబృందంచే పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లోని కరీం కాంప్లెక్స్ ఎదురుగా ఎస్‌కే హాస్పిటల్ వద్ద ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో ఉచితంగా షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, పరీక్షలతో పాటు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం



చారాల : రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



కారకాంపల్లెలో గర్భిణికి బీపీ చెక్ చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులు ఆరోగ్యంగా ఉండగలరని, సుఖ ప్రసవం జరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని కారకాంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పక తినాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, 104 సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

చారాలలో ఫ్యామిలీ డాక్టర్..

మండలంలోని చారాల గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. జ్వరం వచ్చిన వెంటను డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిన ద్రాక్ష, పుష్పాలతో చేసిన వినాయకుడి ప్రతిమలు



శోభాయమానం..



ఆలయంలో పుష్పాలంకరణ



పుష్పశోభితం

కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం జరిగిన పుష్పపల్లకి ఉత్సవానికి ఆలయం పుష్పాలంకరణతో శోభాయమానంగా మారింది. విదేశీ పుష్పాలు, పలు కరాల ఫలాలతో ఆలయాన్ని సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. అన్వేటి మండపం, ధ్వజస్తంభం, ఆలయ పరిసరాలు, సుపథ మండపం, ఆలయ విమాన గోపురాన్ని ముస్తాబు చేసి పుష్పతోరణాలతో నింపేశారు. ఆలయ ముఖద్వారం నుంచి ఆలయ పరిసరాలు మొత్తం పుష్పాలంకరణలో కనువిందు చేశాయి.



ఆలయం వెలుపల ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

- వాహనదారులు పడిపోతున్నా పట్టించుకోరా !
- నగరంలో అధ్వానంగా రోడ్లు



తోటపాళ్యంలో ఇలా..





నగరంలోని ఈశ్వరగుడి వీధి వద్ద ప్రమాదకరంగా రోడ్డుపై గుంత, మిట్టూరులో ఓపెన్‌లో ఉన్న మ్యాన్‌హోల్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు నోరు తెరిచినట్లుగా కనిపిస్తున్నాయి. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఈశ్వరగుడి వీధి వద్ద ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ దర్శనమిస్తోంది. ఇటువైపుగా ఆలయాలకు, తేనెబండ, మార్కెట్, ఆస్పత్రి, పాఠశాలలకు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే మిట్టూరు వద్ద ఉన్న గుంతతో ప్రయాణికులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఇటువైపుగా వీధిదీపాలు సక్రమంగా పని చేయకపోవడంతో మ్యాన్‌హోల్ కనిపించడం లేదు. దీంతో అక్కడ ప్రమాదానికి గురవుతున్నారు. తోటపాళ్యంలోని రోడ్డుపై ఉన్న గుంతను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ఇటువైపు నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. ఇటువైపుగా ఎక్కువగా చిన్నపిల్లలు ఉన్నారు. బయట ఆడుకుంటూ అందులో పలువురు పడిపోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై తాత్కాలికంగా రాళ్లు కాకుండా కాంక్రీట్‌తో వేసిన ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆద్యంతం.. కమనీయం



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రంలోని ఆస్థాన మండపంలో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. హరికథలు, గీతాలాపనలు, పౌరాణిక నాటక ప్రదర్శనలు వినోదభరితంగా సాగాయి. ఆహుతులకు ఆహ్లాదాన్ని పంచాయి. అలాగే కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. అనంతరం కళాకారులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.



నృత్యంతో ఆకట్టుకుంటున్న కళాకారిణి

అడవితల్లినీ వదలని పచ్చనేతలు

- జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్
- కౌండిన్యనదిలో ఇప్పటికే ఇసుక ఖాళీ
- అడవుల్లోని వాగుల నుంచి ఇసుక తవ్వకాలు
- గుడి, బడి పేరిట ఇసుకను తరలిస్తున్న వైనం
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు





పెంగరగుంట వద్ద టీడీపీ నేత డంప్ చేసిన ఇసుక, పెంగరగుంట అడవిలోని ముగ్గురాళ్ల వాగులో ఇసుకను తోడేసిన దృశ్యం

పలమనేరు: పలమనేరు సమీపంలోని కౌండిన్య నదిలో ఇసుకారుల దెబ్బకు ఇప్పటికే ఇసుక ఖాళీ అయింది. దీంతో స్మగర్లు ఇప్పుడు ఇసుక కోసం అడవులపై పడ్డారు. ఇక్కడి కౌండిన్య అభయారణ్యంలో వాగులు, వంకల్లో ఇసుక తవ్వకాలు ఊపందుకున్నాయి. ఫలితంగా పచ్చటి అడవుల్లోని ఇసుకను కూడా వదలకుండా మొత్తం ఖాళీ చేసేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ ఏం చేస్తోందో అర్థం కావడం లేదు.

కౌండిన్య అడవి నుంచి..

పెంగరగుంట ప్రాంతంలోని కౌండిన్య అడవిలోని ముగ్గురాళ్ల వాగు, వంకల నుంచి ఇదే మండలానికి చెందిన ఓ టీడీపీ నేత తన ట్రాక్టర్‌లో అడవిలోంచి ఇసుకను తెచ్చి గ్రామ సమీపంలోని గంగమ్మ ఆలయం వద్ద భారీగా డంప్ చేసిన విషయం శనివారం వెలుగుచూసింది. దీంతో కొందరు గ్రామస్తులు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పచ్చనేతలు కావడంతో ఎవరూ పట్టించుకోలేదని తెలిసింది. ఇప్పుడు నాణ్యమైన ఇసుక ట్రాక్టర్ రూ.4 వేల దాకా పలుకుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే ప్రభుత్వ పనుల కోసం అంటూ, గ్రామంలో ఆలయం పేరిట చెప్పి యథేచ్ఛగా అడవిలోని ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా మండలంలోని అధికారపార్టీకి చెందిన ఓ ముఖ్యనేతకు ఇదే పనిగా పెట్టుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖలు మొద్దు నిద్రలో జోగుతున్నాయి. అక్రమార్కులు మాత్రం లక్షలు గడిస్తున్నారు. వీరి దెబ్బకు అడవుల్లోని ప్రకృతి సంపద సర్వనాశనమవుతోంది. ఈ విషయమై అక్కడి ఎఫ్‌బీఓ కిరణ్‌ను వివరణ కోరగా అడవిలోంచి ఇసుకను ఆలయానికి తీసుకెళ్తున్నామని కొందరు తరలిస్తున్న మాట నిజమేనని అయితే వెంటనే ఆపేశామని చెప్పారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల బేఖాతర్..

తాజాగా కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా అధికారులతో ఇసుక అక్రమ తవ్వకాలపై శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. నదీపరివాహక ప్రాంతాలు, అడవుల్లోని వాగుల్లో ఎవరైనా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత శాఖలు దీనిపై నిఘా పెట్టాలని ఆదేశించారు. కానీ ఆయన ఆదేశించినా ఎవరూ పట్టించుకోలేదనే మాట ఇక్కడ సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను చూస్తే స్పష్టమవుతోంది.

ఆలయంలో చోరీ



హుండీని పగులగొట్టిన దుండగులు

బైరెడ్డిపల్లె: మండలంలోని కడపనత్తం సమీపంలో వెలసిన శ్రీ నల్లగుండ్రాయస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి అందులో నగదును పట్టుకెళ్లారు. శనివారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు, అర్చకులు ముఖద్వారంలో ఉన్న తలుపు తాళాలు పగలకొట్టడంతో అవాక్కయ్యారు. ఆలయం లోపలకు వెళ్లి చూడగా హుండీ తాళాలు పగలకొట్టిన విషయం గుర్తించారు. ఆలయ కమిటీ చైర్మన్‌కు విషయం తెలియజేశారు. భక్తులు కానుకగా సమర్పించిన సుమారు రూ.లక్ష వరకు నగదు తీసుకెళ్లినట్లు చైర్మన్ మురళి తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.